మే నెలలో సదరం క్యాంపులు

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 26 : మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మే నెలలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామని మేడ్చల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మే 2న, 9న, 16న, 23న, 30వ తేదీలలో సదరం క్యాంపులు ఉంటాయని, ఏప్రిల్ 29వ తేదీ నుంచి సదరం స్లాట్స్ మీ సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని అన్నారు. క్యాంపునకు వచ్చే దివ్యాంగులు వారి వెంట మీ సేవా ద్వారా బుక్ చేసుకున్న సదరం స్లాట్ రశీదు, ఆధార్ కార్డు జిరాక్స్, లేటెస్ట్ రిపోర్ట్స్‌తో ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

బీబీఏ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 26 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీబీఏ (అనలిటిక్స్) పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ అధికారులు తెలిపారు. బీబీఏ 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు వచ్చే నెల 16వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నప్పటికీ, పరీక్షలను నిర్వహించే తేదీలలో మార్పులు చేసినట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

చెరువులో వాసవి నిర్మాణాలపై విచారణ

ఆధారాలు ఇవ్వాలని పిటిషనర్‌కు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలోని కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వాసవి ఇన్ఫ్రా ఎల్ ఎల్ పీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు చేస్తుందనే ఆరోపణలకు తగిన ఆధారాలు చూపాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. తమ భూమిలోనే నిర్మాణాలు చేస్తున్నామని వాసవి సంస్థ చెబుతున్నందున ఎఫ్‌టీఎల్ జోన్‌లో నిర్మాణాలకు సంబంధిత ఫొటోలు, ఇతర తాజా ఆధారాలు చూపాలంది. బాచుపల్లి సర్వే నెం.127/పి. 128/పి. 137/పిలో కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో వాసవి ఇన్ఫ్రా ఎల్ఎల్‌పీ 8, 9 బ్లాక్స్ నిర్మాణాలు చేపట్టినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ నిజాంపేటకు చెందిన ఎ.సతీష్ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. నిర్మాణాలు చేసేందుకు హెచ్‌ఎండీఏ అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేసిన పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. బఫర్ జోన్‌లో నిర్మాణాలు ఉన్నాయని తేలితే రెండు బ్లాక్స్‌ను కూల్చేస్తామని వాసవి తరపు సీనియర్ న్యాయవాది బి.మయూర్ రెడ్డి చెప్పారు. రెండు బ్లాక్‌లలోని ఫ్లాట్స్‌అమ్మగా వచ్చిన డబ్బును ఎస్క్రో ఖాతాల్లో ఉంచి నిర్మాణాలు బఫర్ జోన్‌లో ఉన్నాయని తేలితే ఆ డబ్బును కొనుగోలు చేసిన వాళ్లకు చెల్లిస్తామని హైకోర్టు ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పిటిషనర్ న్యాయవాది టి.వెంకట రాజు గౌడ్ వాదిస్తూ, జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన తనిఖీలు చేసి నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉన్నాయని నివేదిక ఇచ్చిందన్నారు. హెచ్‌ఎండీఏ న్యాయవాది మాధవీ రెడ్డి వాదిస్తూ, నీటిపారుదల శాఖ అధికారులు ఎన్‌ఓసీ ఇచ్చాకే తాము అనుమతులు ఇచ్చామన్నారు. వాదనల తర్వాత పిటిషనర్ తగిన ఆధారాలు ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది.

మాజీ కబడ్డీ ప్లేయర్ రాజ్ కన్నుమూత



హైదరాబాద్ ఆట ప్రతినిధి, ఏప్రిల్ 26 : జాతీయ మాజీ కబడ్డీ ప్లేయర్ ఎల్.రాజ్ శుక్రవారం తుది శ్వాస విడిచాడు. గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్న రాజ్.. ఓ ప్రైవేట్ దవాఖానలో కన్నుమూశాడు. తెలంగాణ నుంచి జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రాజ్.. కబడ్డీపై చెరగని ముద్రవేశాడు. ఐదు సార్లు జాతీయ టోర్నీల్లో ఆడిన రాజ్ తెలంగాణకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆయన మృతి పట్ల రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్ సంతాపం ప్రకటించారు. కబడ్డీలో రాజ్ లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

మాదాపూర్, ఏప్రిల్ 26 : భారతీయ సంప్రదాయ కళారూపాలకు నెలవైనది స్టేట్ ఆర్ట్ గ్యాలరీ. మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శిల్పాభా పేరుతో ఏర్పాటు చేసిన ప్రతికృత్, పాప్యానిని శుక్రవారం తెలంగాణ ప్రముఖ విజువల్ ఆర్టిస్ట్, నటి ప్రవంతి జులూరి, ప్రముఖ కళాకారులు సరస్వతి, అన్నపూర్ణ మడిపడిగల ప్రారంభించారు. ఈ నెల 27 నుంచి చెరియాల్ స్క్రోల్ పెయింటింగ్ వర్క్ షాపును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నిజాం కళాశాల.. కోర్సుల బ్రోచర్ ఆవిష్కరణ

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 26 : విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు విద్యానంతరం ఉపాధిని కల్పించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో సోషియాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వివిధ కోర్సులు, వాటి ప్రత్యేక తలను, ఉపాధి అవకాశాలు, ఫ్యాకల్టీ మెంబర్స్ ప్రొఫైల్స్‌కు సంబంధించిన వివరాలతో రూపొందించిన బ్రోచర్‌ను ఆయన సోషియాలజీ విభాగం ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ తిరుపతి, డాక్టర్ మాలతి, డాక్టర్ సీహెచ్ పరంధాములుతో కలిసి ఆవిష్కరించారు.

ముంపు తప్పదా.?

గ్రేటర్‌కు పొంచి ఉన్న వరద ముంపు

నత్తనడకన నాలా పూడికతీత పనులు

ఎస్ఎన్‌డీపీ పనుల్లోనూ కనిపించని పురోగతి

బల్దియా వ్యాప్తంగా ఒక్కచోట కూడా 50శాతం పూర్తికాని పనులు

కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించకపోవడమే కారణం

నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయడం కష్టమే

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : వచ్చే వర్షాకాలంలో గ్రేటర్‌లో వరద ముంపు పొంచి ఉన్నదా? అంటే నత్తనడకన జరుగుతున్న నాలా పూడికతీత , ఎస్ఆర్‌డీపీ తొలి విడత పథకం పనులను చూస్తే అవుననే అనక తప్పదు. ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది వేసవిలో దాదాపు రూ.45 కోట్ల ఖర్చుతో రూ.884.15 కిలోమీటర్ల మేర నాలా పూడిక తీత పనులు చేపట్టాలని నిర్ణయించి, మే 31వ తేదీ నాటికల్లా ఈ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, చార్మినార్ జోన్లలో ఏ ఒక్క జోన్‌లో 50శాతం కూడా పనులు పూర్తి చేయలేదని, కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లింపులు లేకనే పనులు నత్తనడకన జరుగుతున్నట్లు తెలుస్తున్నది.

కాంట్రాక్టర్లకు వెయ్యి కోట్ల బకాయిలు

ఖైరతాబాద్ జోన్‌లోని ఐదు సర్కిళ్లు మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ ఉండగా రూ.10.73కోట్లతో 63 పనులు చేపడుతున్నారు. 171.256 కిలోమీటర్ల రూ. 53.96 కిలోమీటర్లు పూర్తి చేశారు. నిర్దేశిత లక్ష్యంలోగా పనులు పూర్తి కావడం కష్టమేనని స్వయంగా ఇంజినీర్లలో చర్చ జరుగుతున్నది. బల్కాపూర్ నాలా డీసిల్టింగ్‌కు సంబంధించి మొత్తం 9.64 కిలోమీటర్లలో 4 కి.మీ.లు మాత్రమే పూర్తి చేశారు. ఇప్పటికే సంస్థ పరిధిలో దాదాపు రూ.1000కోట్ల బకాయిలు ఉన్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు పనులు చేపట్టబోమని కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేస్తూ వస్తున్నారు. దీనికి తోడు సంస్థ ఆర్థిక పరిస్థితి నానాటికీ దిగజారిపోతున్నది. వెరసి జీహెచ్‌ఎంసీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు అసక్తి కనబర్చడం లేదు. ఈ ప్రభావం తాజాగా నాలాల పూడిక తీత పనులపై పడుతున్నది. ఇదే జరిగితే సకాలంలో పనులు పూర్తి కాగా వచ్చే వర్షాకాలంలో వరద ముంపు సమస్యలు తప్పేలా లేవు.

సకాలంలో పనులు పూర్తి కాకపోతే..

ఎస్ఎన్‌డీపీ పనులు జరుగుతున్న ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో పనులు పూర్తి కాకపోతే ముంచెత్తే వరద నీటితో బతుకులు ఆస్తవ్యస్తమయ్యే పరిస్థితులు ఉంటాయన్న భయాందోళనకు గురవుతున్నారు. వాస్తవంగా బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 అక్టోబరు మాసంలో వరుణుడి బీభత్సం తర్వాత వరద నీటికి శాశ్వత చర్యలు చేపట్టాలని భావించిన ఎస్ఎన్‌డీపీ తొలి విడత పథకం ద్వారా రూ.985.45కోట్లతో 58 చోట్ల నాలా అభివృద్ధి పనులను చేపట్టింది. పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.531కోట్లతో 35 ప్రాంతాలలో వేలాది కాలనీల వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపింది. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ పనుల పురోగతిపై సమీక్షించిన దాఖలాలు లేవు. ఖజానాలో డబ్బులేక కాంట్రాక్టర్లకు చెల్లింపులను నిలిపివేశారు. చాలా చోట్ల గోడలు, స్లాబుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఫలితంగా రూ.394.65 కోట్లతో 20 చోట్ల జరుగుతున్న పనులపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా వచ్చే వర్షాకాలం నాటికల్లా ఈ పెండింగ్ పనులు పూర్తి కాకపోతే సరూర్‌నగర్, నాగోల్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్, చాంద్రాయణగుట్ట హయత్‌నగర్, వనస్థలిపురం, హబ్సిగూడ, ఉప్పల్ రామంతాపూర్‌తో పాటు శివారు ప్రాంతాలైన బడంగ్‌పేట, జల్‌పల్లి, పెద్ద అంబర్‌పేట, మీర్‌పేట ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. కాగా జీహెచ్‌ఎంసీ పరిధిలో రూ.747.45కోట్లతో 37 చోట్ల పనులకు ఎస్‌బీఐ ద్వారా రూ. 515.96కోట్ల రుణం తీసుకోగా.. మిగిలిన రూ. 231.81 కోట్ల నిధులను జీహెచ్‌ఎంసీ సమకూర్చాల్సి ఉంది. జీహెచ్‌ఎంసీ అవతల రూ.238 కోట్లతో 21 చోట్ల జరిగే పనులకు శివారు మున్సిపాలిటీలు నిధుల భారం భరించాల్సి ఉంటుంది. మొత్తంగా నిధుల అడ్డంకితో నాలా అభివృద్ధి పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది.

ఎన్నికలపై ఫిర్యాదులుంటే..

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లాలో సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు జనరల్, పోలీస్ వ్యయ పరిశీలకులు జిల్లాకు వచ్చిన నేపథ్యంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు, అభ్యర్థులు, ఎవరైనా వారిని కలవడానికి బంజారాహిల్స్ రోడ్డు నంబర్.12లో సిటీ మేనేజర్ ట్రైనింగ్ సెంటర్ గెస్ట్ హౌస్‌లో అందరూ ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు అందుబాటులో ఉంటారని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు.

పార్లమెంట్ నియోజకవర్గం	వ్యయ పరిశీలకులు	ఫోన్ నంబర్
సికింద్రాబాద్	డా.సరోజ్ కుమార్	9154342022
హైదరాబాద్	శ్రీవిద్య	9154342023
కంటోన్మెంట్	అమిత్ శుక్ల	9154342028
పోలీస్ పరిశీలకులు	ఆనంద్	9154342168
వ్యయ పరిశీలకులు	సెంతిల్‌కుమార్	9154342027

ప్రకృతిని రక్షించుకుందాం

లేక్ వ్యూ పార్కులో సిటీ నేచర్ ఛాలెంజ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 26 : ప్రకృతిని పరిక్షించుకోవడంతో పాటు సకల జీవరాశులపై తమ ప్రేమను చాటాలని పిలుపునిస్తూ హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని లేక్ వ్యూ పార్కులో సిటీ నేచర్ ఛాలెంజ్‌ను నిర్వహించారు. శుక్రవారం హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం డైరెక్టర్ ప్రదీప్ కుమార్ శెట్టి, అసిస్టెంట్ డైరెక్టర్ విశ్వప్రసాద్, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి రఘువీర్ ప్రారంభించారు. ప్రపచంలోని 700 దేశాలతో పాటు భారతదేశంలో 206 నగరాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రదీప్ కుమార్ శెట్టి తెలిపారు. వరల్ వైల్డ్ ఫెడరేషన్ సహకారంతో చేపట్టిన సినీ నేచర్ ఛాలెంజ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, తమకు కనిపించే మొక్కలు, జీవరాశుల ఫొటోలు తీసి www.citynaturechallenge.org, వెబ్‌సైట్, inaturalist యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, తద్వారా వృక్ష, జంతు, పక్షి జాతితో పాటు వాటికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకోవచ్చని, ఈ నెల 29వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వివేకానంద సేవా సమితి ప్రతినిధులు ఉదయ భాస్కర్, వాకర్స్ బాక్సర్ అశోక్, ధర్మరాజు, గోవింద్, సంజయ్, పర మేశ్, సుధాకర్, శంకర్, అరుణ్, కరుణాకర్, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో 'రెన్యూ ఎక్స్-2024' ప్రారంభం

రెన్యూ ఎక్స్-2024 కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యతేజ్‌రెడ్డి తదితరులు

మాదాపూర్, ఏప్రిల్ 26 : దక్షిణ భారతదేశంలో పునరుత్పాదక ఇంధనం, నికర జీరో వ్యూహాలు, స్థిరమైన వృద్ధి సాంకేతికతలపై రెన్యూ ఎక్స్ ప్రత్యేక దృష్టి పెడుతుందని పవర్, యుటిలిటీ, పీడబ్ల్యూసీ డైరెక్టర్ భాగ్య తేజ్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన రెన్యూ ఎక్స్-2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పవర్, యుటిలిటీ, పీడ బ్ల్యూసీ డైరెక్టర్ భాగ్యతేజ్‌రెడ్డి విచ్చేసి తెలంగాణ స్టేట్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రాష్ట్ర సలహాదారు అజయ్ మిశ్రా, ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేస్ ముద్రాస్‌లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 150కి పైగా దేశీయ, అంతర్జాతీయ ఎగ్జిబిటర్లు పాల్గొనగా 5 వేలకు పైగా సందర్శకులు విచ్చేయనున్నట్లు అంచనా వేశారు.

ముదిరాజులను 'బీసీ ఏ'లో ఎలా కలుపుతావ్

రవీంద్రభారతి, ఏప్రిల్ 26 : ఉమ్మడి మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి నారాయణపేట సభలో బీసీ డిలో ఉన్న ముదిరాజులను బీసీఏలో కలుపుతామనడం సరికాదని నాయీబ్రాహ్మణ సంఘం తీవ్రంగా ఖండించింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం సలహాదారుడు ప్రొఫెసర్ డాక్టర్ బాగయ్య మాట్లాడుతూ బీసీలోని 56 కులాలు అత్యంత వెనుకబడి దుర్భర జీవనం కొనసాగిస్తున్నాయని, ఇందులో అభివృద్ధి చెందిన ముదిరాజులను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. సీఎం వ్యాఖ్యలు అనంతరామన్ కమిషన్ సిఫార్సుకు వ్యతిరేకమని తెలిపారు. బీసీ ఏలో ముదిరాజులను చేర్చాలని ప్రేమ ఉంటే బీసీ ఏలోని 56 కులాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని.. లేకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని ప్రొఫెసర్ డా.బాగయ్య హెచ్చరించారు. త్వరలోనే హైదరాబాద్ వేదికగా 56 కులాలతో భారీ ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు డాక్టర్ రాపోలు సుదర్శన్, బాలరాజ్, దేవరకొండ నాగరాజు, గడప శ్రీహరి, నరహరి, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓయూ ఆవిర్భావ వేడుకలు

ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సారస్వత్

డాక్టర్ వీకే సారస్వత్‌ను సన్మానిస్తున్న ఓయూ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 26 : ఉస్మానియా యూనివర్సిటీ 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వేడుకలు ఘనంగా ముగిశాయి. చివరిరోజు శుక్రవారం ఠాగూర్ ఆడిటోరియంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. యూజీసీ డీన్ ప్రొఫెసర్ జి.మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ సభ్యుడు, డీఆర్‌డీవో మాజీ డీజీ, పద్మభూషణ్ డాక్టర్ విజయ్‌కుమార్ సారస్వత్, గౌరవ అతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, అమెరికాలోని ఇమేజియా కార్పొరేషన్ ఫౌండర్, సీఈవో వీణ గుండవెళ్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వీకే సారస్వత్ మాట్లాడుతూ గత పదేళ్లలో దేశ స్థూల జాతీయోత్పత్తి 30 శాతం పెరిగిందని అన్నారు. సమాజాభివృద్ధికి విజ్ఞాన శాస్త్రాలు చోదక శక్తిగా ఉంటాయని చెప్పారు. అదే సందర్భంలో సమాజంలో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కూడా విజ్ఞాన శాస్త్రాలపైనే ఉంటుందని అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక, సామాజిక, విజ్ఞానాభివృద్ధి తీరుతెన్నులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దేశ సమగ్రాభివృద్ధి, సవాళ్లను అధిగమించేందుకు విద్యాసంస్థలతో కలిసి పరిశ్రమలు, లేబరేటరీలు పరిశోధనలను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధితో పాటు సమాజ అవసరాలు, ఉద్యోగ కల్పన దిశగా ప్రణాళికలు ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచే దిశగా నూతన జాతీయ విద్యా విధానం 2020 అందుబాటులోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బుర్రా వెంకటేశం మాట్లాడుతూ విద్యారంగానికి ఓయూ చేస్తున్న కృషిని కొనియాడిన ఆయన మరింత భాధ్యతతో అన్ని రంగాల్లోనూ ఓయూ మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. వీణ గుండవల్లి మాట్లాడుతూ ఎవరికి వారే వనరులను సృష్టించుకునే దిశగా ఆలోచించి, ప్రణాళిక వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి జయరాజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, డైరెక్టర్లు, డీన్లు, వివిధ విభాగాల హెడ్‌లు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పగటి పూట బయటకు రావద్దు

సిటీబ్యూరో, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వేడి గాలులు వీస్తున్న విషయం తెలిసిందే. దీంతో పనులపై బయట తిరిగే వారు, ఎండలో ఎక్కువ సేపు పనిచేసేవారు వడదెబ్బకు గురయ్యే అవకాశాలున్నందున అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ముందస్తు చర్యలు చేపట్టినట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఎవరైనా వడదెబ్బకు గురైనా, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నా వెంటనే సమీపంలోని ప్రభుత్వ దవాఖానను ఆశ్రయించాలని సూచిస్తున్నారు. బస్తీ దవాఖానల్లో సైతం వడదెబ్బకు సంబంధించిన పూర్తి స్థాయి చికిత్స అందుబాటులో ఉన్నదని, ఆరోగ్య కేంద్రాల్లో ముందస్తు చర్యలు చేపట్టినట్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు డా.వెంకటి, డా.వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటి నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు పగటిపూట బయట ఎండలో తిరగకుండా చూడాలని, అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. తరచూ ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

చేవెళ్ల లోక్‌సభ బరిలో..

17 మంది నామినేషన్ల తిరస్కరణ

47 మంది నామినేషన్ల ఆమోదం

ఈనెల 29 వరకు ఉపసంహరణకు గడువు

రంగారెడ్డి, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ) : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికకు దాఖలైన నామినేషన్లలో స్క్రూట్నీ ప్రక్రియ అనంతరం అధికారులు 17 మంది అభ్యర్థులకు సంబంధించిన నామినేషన్లను తిరస్కరించారు. 47 మంది అభ్యర్థులకు సంబంధించిన నామినేషన్లను ఆమోదించారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 64 మంది అభ్యర్థులు 88 నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్వో కార్యాలయంలో నిర్వహించిన నామినేషన్ల స్క్రూట్నీ ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగా లేని 17 మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. దీంతో 47 మంది అభ్యర్థులకు సంబంధించిన నామినేషన్లు ఆమోదించబడ్డాయి. ఈనెల 29 వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎన్నికల బరిలో ఎంతమంది ఉంటారన్నది తేలనున్నది.

అబద్ధాల రేవంత్ పాలన అట్టర్ ఫ్లాప్

తులం బంగారం తుస్సుమంది.. మహాలక్ష్మి పథకం మాయమైంది

సీఎం పనికిమాలిన మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దు

మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

జవహర్‌నగర్, ఏప్రిల్ 26 : ఒడ్డు ఎక్కే వరకు ఓడ మల్లన్న.. ఒడ్డు ఎక్కినంకా.. బోడ మల్లన్న అన్న చందంగా సీఎం రేవంత్‌రెడ్డి తీరు ఉన్నదని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆడ బిడ్డల పెండ్లికి తులం బంగారం పెండ్లి పందిట్లోనే ఇస్తామని, మహిళలకు మహాలక్ష్మి పథకంతో ఆర్థికంగా సాయం అందజేస్తామని అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఫైరింగ్‌కట్టా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్ములాటలకే సరిపోతుందని, రాష్ట్ర అభివృద్ధిపై సోయి లేదని, ఆసరా, దివ్యాంగులకు పింఛన్లు పెంచుతామని చెప్పిన మాటలు.. నీటి మూటలుగానే మిగిలిపోయాయని అన్నారు. ఉత్త చిప్ప, లంకెబిందెలు అంటూ.. పనికిమాలిన మాటలు మాట్లాడుతూ ప్రజల్లో సానుభూతి పొందుదామని చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. రైతు కంట నీరు పెట్టించిన ఏ ప్రభుత్వాలు మనుగడ సాధించలేదని, సరైన కరెంటు, మద్దతు ధర లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులున్నారని విమర్శించారు. దేశ అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్ రెడ్డి, విక్రంరెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, కమల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

నిజాం కళాశాలలో.. పూర్వ విద్యార్థుల బోర్డులు

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 26 : 137 సంవత్సరాల చరిత్ర కలిగిన నిజాం కళాశాలలో ఎంతో మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదిగారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా అన్నారు. శుక్రవారం నిజాం కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఫ్లెక్సీలతో మీకు తెలుసా.? శాశ్వత బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ బోర్డులను ఆయన విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి, అకాడమీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రేణుక, స్టూడెంట్ అడ్వైజర్ మహమ్మద్ అలీ